క్లుప్తంగా

భక్తులతో సింహగిరి కిటకిట


నీలాద్రి గుమ్మం వద్ద భక్తుల రద్దీ

సింహాచలం : సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. రెండవ శనివారం సెలవురోజు కావడంతో పలుపాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. గిరి ప్రదక్షిణరోజు 32 కిలోమీటర్లు ప్రదక్షిణ చేసి, సింహగిరిపైకి వెళ్లిన పలువురు భక్తులు కూడా వచ్చారు. భక్తులతో దర్శన క్యూలు, ప్రసాద విక్రయశాల, కేశఖండనశాల, బస్సులు, అన్నప్రసాద భవనం కిటకిటలాడాయి.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం


నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై కొలువై ఉన్న వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, బాల భోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గండిబాబ్జీ తెలిపారు. పెదముషిడివాడ, కన్నూరు గ్రామాల్లో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరవాడ మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, పరవాడ మాజీ ఎంపీపీ మాస ఆప్పలనాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆశ్రయం


వృద్ధురాలిని లయోలా ఆశ్రమానికి చేర్చిన పోలీసులు

పెందుర్తి: వృద్ధాప్యంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ఓమహిళను పెందుర్తి పోలీసులు లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. సహకారి కుంచం(61) అనే మహిళ కుటుంబ సభ్యులు, బంధువులు లేకపోవడంతో నగరంలోని ఓఇద్దె ఇంట్లో ఇబ్బందికరంగా కాలం వెళ్లదీస్తోంది. ఈ విషయాన్ని గాంతికెట్టిపాలెనికి చెందిన రత్నాల సునీత అనే మహిళ పెందుర్తి పోలీసులకు తెలియజేసి, కుంచంకు ఎక్కడైనా ఆశ్రయం కల్పించి, ఆదుకోవాలని కోరారు. వెంటనే స్పందించిన సీఐ కె.వి. సతీష్‌కుమార్ స్థానిక లయోలా వృద్ధాశ్రమ నిర్వాహకు దొడ్డి ప్రకాశరావును సంప్రదించి, కుంచంకు ఆశ్రయం కల్పించాలని సూచించగా అందుకు ఆయన అంగీకారం తెలిపారు.దీంతో పోలీసులు ఆమెను శనివారం వృద్ధాశ్రమంలో చేర్పించారు.

26 మద్యం బాటిళ్ల పట్టివేత

మల్కాపురం: రహస్యంగా ఇంట్లో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మల్కాపురం పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు.వారి నుంచి 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.వివరాలు ఇలా ఉన్నాయి. 62వ వార్డు దుర్గానగర్ ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు తమ ఇళ్లల్లో రహస్యంగా మద్యం విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో రెండు బృందాలు మద్యం విక్రయిస్తున్న ఇళ్లపై దాడులు చేశారు. ఇద్దరి నుంచి సుమారు 26 బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

- బిల్లులు విడుదల చేయని ప్రభుత్వం
- అప్పులు తెచ్చి వండి పెడుతున్న వంట కార్మికులు
- నాలుగు నెలలుగా అందని వేతనాలు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కార్మికులు

మధ్యాహ్న భోజనం.. నిర్వాహకులకు భారం


సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కూరవండుతున్న మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకురాలు గౌరీ

సబ్బవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వండిపెడుతున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు గౌరవ వేతనం, బిల్లులు అందక నానా అవస్థలు పడుతున్నారు. నాలుగు నెలలుగా వారికి బిల్లులు, గౌరవ వేతనాలు అందలేదు. మండలంలో మొత్తం 51 ప్రభుత్వ పాఠశాలల్లో 3,220 మంది విద్యార్థులున్నారు. జూనియర్ కళాశాలలో 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ వంట చేసేందుకు ఈ పథకంలో 86 మంది కుక్ లు, హెల్పర్లు పనిచేస్తున్నారు. పాఠశాలల్లో పనిచేస్తున్న నిర్వాహకులకు మార్చి, ఏప్రిల్,మే, జూన్ నెలల, జూనియర్ కళాశాలలో పనిచేస్తున్నవారికి జనవరి నుంచి జూన్ నెల వరకు గౌరవ వేతనాలు అందలేదు. పాఠశాలల్లో 9,10 తరగతుల విద్యార్థులకు మూడు నెలలు, ఒకటి నుంచి 8 వ తరగతి వరకు గల విద్యార్థులకు సంబంధించి నాలుగు నెలల మెస్ బిల్లులు మంజూరు కాలేదు. జూనియర్ కళాశాలకు సంబంధించి జూన్ వరకూ మెస్ బిల్లులు చెల్లించలేదు. ఒక్కో నెలకు మెస్ బిల్లులు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకూ ఉంటాయని, వీటిని ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో తమపై ఆర్థిక భారం పడుతోందని మధ్యాహ్న భోజన నిర్వాహకులు వాపోతున్నారు. రూ.3.50 లక్షల గౌరవ వేతనం, మెస్ బిల్లులు చెల్లించవలసి ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మధ్యాహ్న భోజన పథకం నీరుగారుతోంది.భోజనం వండిపెడుతున్న కార్మికులకు చాలా నెలలుగా బిల్లులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు చోట్ల బయట అప్పులు తెచ్చి మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లోనే బిల్లులు ఉండటంతో వచ్చే బిల్లులు వడ్డీలకే సరిపోతున్నాయని కార్మికులు వాపోతున్నారు


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కార్మికులు

ధరాఘాతంతో విలవిల..

పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు అందరికీ చుక్కలు చూపిస్తున్నాయి. దీంతో మధ్యాహ్న భోజనం వండి పెట్టడం కష్టంగా మారిందని భోజన కార్మికులు వాపోతున్నారు. పెరిగిన ధరలతో సరుకులు కొనలేని పరిస్థితులున్నాయి. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5.90 చొప్పున ప్రభుత్వం మెస్ బిల్లులు చెల్లిస్తుండగా ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు రూ.8.57 చొప్పున అందజేస్తోంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమ కమీషన్ పెంచాలని కార్మికులు కోరుతున్నారు. ప్రతినెలా ప్రభుత్వం సరిగ్గా బిల్లులు, వేతనాలు చెల్లిస్తే పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టడానికి అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు.


అన్నం వారుస్తున్న మహిళలు


వంట పనిలో నిమగ్నమైన మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

గౌరవ వేతనం పెంచాలి



పథకం ప్రారంభం నుంచి పనిచేస్తున్నాను. ప్రారంభంలో రూ.400 గౌరవ వేతనం చెల్లించేవారు. ఇప్పుడు రూ.3 వేలు ఇస్తున్నారు. ఇప్పుడు చెల్లిస్తున్న వేతనంతో జీవనం సాగించడం కష్టంగా ఉంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఏ రోజుకైనా గౌరవ వేతనాన్ని, చార్జీలను ప్రభుత్వం పెంచుతుందన్న ఆశతో పనిచేస్తున్నాం. మా కష్టాన్ని గుర్తించి గౌరవ వేతనం పెంచాలి.

–శిరిడి గౌరి, గోపాలనగర్,సబ్బవరం మండలం

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం



జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం కావడంతో సబ్బవరం కళాశాలలో వంట చేసేందుకు చేరాను. కార్యక్రమం ప్రారంభమైనా ఆరు నెలలైంది. ఇప్పటి వరకూ గౌరవ వేతనాలుగానీ,మెస్ చార్జీలుగానీ కార్మికులకు చెల్లించలేదు.దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం.

–నంబారు వెంకటలక్ష్మి, గోపాలనగర్,సబ్బవరం మండలం

వేరే పనికి వెళ్లలేక..



20 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలిగా పనిచేస్తున్నాను. కనీస వేతనం చెల్లించకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. వేరే పని చేసేందుకు వెళ్లలేక, ఏ రోజుకైనా గౌరవ వేతనం పెంచుతారన్న ఆశతో పనిచేస్తున్నాను.

–గండి రమణమ్మ, జోడుగుళ్ళ,సబ్బవరం మండలం.

త్వరలో చెల్లించేందుకు చర్యలు

ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనాలు, చార్జీల బకాయిలు మార్చి వరకూ వారికి చెల్లించాం. కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నచోట నిలిచిపోయిన వాటిని సరిచేసి బిల్లులు చెల్లిస్తాం. జూనియర్ కళాశాలలో జనవరి నుంచి ఇప్పటి వరకూ కార్మికుల వేతనాలు,మెస్ చార్జీల బకాయిలు చెల్లించలేదు.త్వరలో బకాయిలు చెల్లించే విధంగా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళతాను.

–లక్ష్మణరావు, మండల విద్యాశాఖాధికారి,సబ్బవరం మండలం

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

సబ్బవరం: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో పాటు విధులు నిర్వహించకుండా రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్న వ్యక్తిపై సబ్బవరం పోలీసులు కేసు నమోదు చేశారు.స్థానిక తహసీల్దార్ బి.చిన్నకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని అసకపల్లి రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 1లో 257.31 ఎకరాల్లో కొండ ఉంది. దానిని ఆనుకుని కొండపోరంబోకు భూమి ఉంది. అదే సర్వే నంబర్‌లో సుమారు 30 సెంట్ల ఖాళీ స్థలం ఉండడంతో కొంతమంది అక్రమించి అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో పునాదులు నిర్మించారు. అక్రమణలపై ఫిర్యాదు అందడంతో తమ సిబ్బంది వెళ్లి, ఆక్రమణలను తొలగించి, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారని తహసీల్దార్ చెప్పారు. అయినా యథావిధిగా నిర్మాణాలు చేపడుతుండడంతో శుక్రవారం ఆర్ఐ వీరయ్య, వీఆర్వో ఈశ్వరరావులు పొక్లెయిన్‌ను తీసుకువెళ్లి ఆరు సెంట్ల స్థలంలో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగిస్తుండగా అదే గ్రామానికి చెందిన కర్రి కృష్ణ అడ్డుకుని విధులకు ఆటంకం కలిగించినట్టు చెప్పారు. వీఆర్వో,ఆర్ఐలు ఇచ్చిన నివేదిక ఆధారంగా సబ్బవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ జి.రామచంద్రరావు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు తహసీల్దార్ తెలిపారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సబ్బవరం:యువత మత్తుపదార్థాలు,బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని డీఎస్పీ విష్ణు స్వరూప్ తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలన,రహదారుల భద్రత,సైబర్ నేరాలపై స్థానిక సీతారామ కల్యాణ మండపంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఈజీ మనీ, బెట్టింగ్ యాప్‌లకు అలవాటు పడటంతో పాటు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇన్‌స్టాగ్రామ్,ఫేస్ బుక్,వాట్సప్ వంటి సోషల్ మీడియా యాప్‌ల ద్వారా చిన్నారులను, బాలికలను వేధిస్తే శిక్ష తప్పదన్నారు.గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలు కావద్దని చెప్పారు. రహదారుల భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల వల్ల గత సంవత్సరం 1.65 లక్షల మంది వరకూ మృత్యువాత పడినట్టు తెలిపారు. ఒక్క అనకాపల్లి జిల్లాలోనే 365 మంది మరణించారని చెప్పారు. సురక్షితమైన ప్రయాణానికి ప్రతి ఒక్కరూ రహదారుల భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ జి.రామచంద్రరావు,ఎస్ఐ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

పెరుగుతున్న భూ వివాదాలు

కుర్మన్నపాలెం: కుర్మన్నపాలెంలో జాతీయ రహదారికి సమీపంలో సుమారు 1.40 ఎకరాల భూమి మాదే అంటే మాది అని రెండు వర్గాల వారు పట్టు బడుతూ స్థలంలో గొడవపడ్డారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి ఇరు వర్గాల వారిని పోలీస్ స్టేషన్‌కు రప్పించి సర్దిచెప్పారు. సర్వేనంబర్ 123–1లోని సుమారు 1.40 ఎకరాల భూమిని కడంబెట్టి అప్పలరాజు అనురా సోదరులు 1983లో భీమిలి సన్యాసయ్య దగ్గర కొనుగోలు చేశారు. అయితే ఆ భూమి అప్పటి నుంచి ఖాళీగా ఉంది. ఐతే సన్యాసయ్య వారసులు ఆ భూమిని దదును చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో కడంబెట్టి కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించడంతో ఇరువర్గాల వారిని శనివారం స్టేషను దించిన దాక్యుమెంట్లు పట్టుకొని రావాలని సూచించారు. అయితే కడంబెట్టి వర్గం శనివారం భూమికి వెళ్లగా సన్యాసయ్య వారసులు ఆ స్థలంలోకి ప్రవేశించడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని రెండు వర్గాల వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇరువర్గాల వారు సమీప అధికారుల వద్ద మళ్లీ మాట్లాడాలని సూచించారు. ఈ వివాదంలో కొంతమంది పెద్దల జోక్యం ఉండడంతో ఎటూ చెప్పలేని పరిస్థితి నెలకొంది.


వివాదాస్పద స్థలంలో ఘర్షణ పడుతున్న దృశ్యం

ఉత్సాహంగా క్రీడా పోటీలు


మాట్లాడుతున్న ముఖ్య అతిథి ఫాదర్ బాలశౌరి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఫాదర్లు, సిస్టర్లు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ క్యాథ్రల్ చర్చిలో ఆగస్టు 1 నుంచి జరిగే దేవమాత మెట్టారోహణ ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఆర్‌సీఎం విశాఖ అర్చి డయోసిస్, చర్చి వికార్ జనరల్ రెవరెండ్ ఫాదర్ జ్ఞానప్రకాశ్ జాన్ ప్రకాష్ సంయుక్త ఆధ్వర్యంలో సెయింట్ పీటర్స్ మైదానంలో జరిగిన ఈ పోటీలను జనరల్ రెవరెండ్ ఫాదర్ దగ్గుండి బాలశౌరి, రెవరెండ్ ఫాదర్ రసన ప్రతాప్ ప్రారంభించారు. ముందు దేవమాత ఉత్సవాల లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఉత్సవాలను ఉద్దేశించి ముఖ్య సందేశం అందించారు. కార్యక్రమంలో జ్ఞానాపురం సహాయ వికారుడు, రెవరెండ్ ఫాదర్లు, విమల్ రాజ్, ప్రేమ్‌కుమార్, సిస్టర్ రోస్‌మేరీ, జాక్సీ ప్రిన్సిపాల్ ఆంథోనమ్మ, పీపీసీ అధ్యక్షుడు ముసురు రాజేష్ బాబు, ఏపీసీయా అధ్యక్షుడు బూర శేఖరబాబు, విజయకుమార్, విక్రాంత్, తేజ, రాబీ పాల్గొన్నారు.

చిల్డ్రన్ హోంలో అన్నదానం

దువ్వాడ,రైల్వే: సంఘ సేవకుడు రవిశంకర్‌రెడ్డి 14వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పెందుర్తి బీనా చారిటబుల్ ట్రస్ట్ చిల్డ్రన్ హోం పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హోంలో ఆశ్రయం పొందుతున్న పలువురు చిన్నారులకు రవిశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రవిశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు రెడ్డి రమాదేవి, బీహర్, మయాళ్, బాదిరెడ్డి పైడితల్లమ్మ, కర్నాల రమణమ్మ, రాము, బాదిరెడ్డి కృష్ణ (గోపి), వెంకట నాగలక్ష్మి, బాదిరెడ్డి జగన్నాథరావు, పద్మ, ఎస్ఆర్ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


హోం పిల్లలతో రవిశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

స్మార్ట్ మీటర్లను తిరస్కరించండి

- స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వ్యతిరేక ర్యాలీలో సీపీఎం నాయకులు

పెందుర్తి: గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామంటే తరిమికొట్టండని పిలుపునిచ్చిన మంత్రి లోకేష్ ఇప్పుడు ఆదానీ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడానికి సిద్ధం కావడం సిగ్గుచేటు అని సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ కార్యదర్శి బి.జగన్ విమర్శించారు. ప్రజలంతా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సిద్ధమైన స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని పిలుపునిచ్చారు. 'ఆదానీ స్మార్ట్ మీటర్లు వద్దు–పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు' అనే నినాదంతో జీవీఎంసీ 97వ వార్డు కార్మికనగర్‌లో శనివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ప్రజలు ప్రస్తుతం తాము వినియోగించిన విద్యుత్‌కు మాత్రమే బిల్లులు కడుతున్నారని..అదే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే వినియోగదారులపై తీవ్ర భారం పడుతుందన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ప్రజలను వంచిస్తూ ఆదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తోందని మండిపడ్డారు. ఒక్కో మీటరుకు కేటగిరీలను బట్టి రూ.8,927, రూ.17,286 వసూలు చేయాలని నిర్ణయించడం దారుణమని చెప్పారు. పైగా గతంలో బిల్లులు చెల్లింపునకు కనీసం 15 రోజుల గడువు ఉండేదని కానీ ఇప్పుడు స్మార్ట్ మీటర్ల పుణ్యమా అని ముందుగానే విద్యుత్‌కు రీచార్జ్ చేసుకునే దుస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పొరపాటున రీచార్జ్ చేసుకోకపోతే ప్రజలు చీకట్లో బతకాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ చార్జీల ప్రక్రియ పైనెట్టు ప్రజలు వ్యక్తం చేస్తుండగా ప్రజలు సామాన్యులపై తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని సూచించారు. లేకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జోన్ కమిటీ నాయకులు బి.వెంకటరావు, బి.రమణి, కె.అప్పలనాయుడు, రామారావు, ఈశ్వరరావు, నాయుడు, గోపి, మహేష్, రాజు, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.


స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

సోలార్ విద్యుత్‌తో బహుళ ప్రయోజనాలు


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఈఈ బి.కె.నాయుడు

గాజువాక: గృహ విద్యుత్ వినియోగదారులు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడంద్వారా వివిధ ప్రయోజనాలు పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు అన్నారు. సోలార్ విద్యుత్ ప్రయోజనాలపై శ్రీనగర్‌లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా బ్యాంకు నుంచి రూ.78 వేల సబ్సిడీ పొందవచ్చన్నారు. ఈ పథకంలో బీసీలకు అదనంగా మరో రూ.20వేల సబ్సిడీ లభిస్తుందన్నారు. ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారు ఈ పథకాన్ని పూర్తిగా ఉచితంగా పొందవచ్చన్నారు. సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడంవల్ల వినియోగదారుల విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన అవసరం ఉండదని, మిగులు విద్యుత్ ఉంటే ప్రభుత్వమే తీసుకొని నగదు చెల్లిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సోలార్‌పవర్ ప్రోవర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, మాజీ కౌన్సిలర్ పద్మ రాజారావు, ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ రామకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు


దాత నాగేశ్వరరావుకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్


శ్రీనివాస అరవింద్ వర్మకు బాండ్ అందజేస్తున్న అన్నదానం విభాగం ఉద్యోగి హరి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన బి.నాగేశ్వరరావు రూ.1,00,116 విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు ప్రొటోకాల్ విభాగం పర్యవేక్షకుడు విక్రమ్ బాండ్ అందజేశారు. అలాగే విజయవాడకు చెందిన డి.శ్రీనివాస అరవింద్ వర్మ రూ.1,01,116 విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున అన్నదానం విభాగం ఉద్యోగి హరి దాతకు బాండ్ అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందజేశారు.

'రిజిస్ట్రేషన్ బిల్లుతో ఆస్తులకు రక్షణ కరువు'

సబ్బవరం: రిజిస్ట్రేషన్ బిల్లు–2025ను అమలు చేస్తే ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడంలో ఇబ్బందులు ఏర్పడతాయని దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శేఖరముల్లి శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు చిదంబర స్వామి తెలిపారు. మండలంలోని గోటివాడ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అనకాపల్లి జిల్లా దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన రిజిస్ట్రేషన్ బిల్లును అమలు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు లక్ష మంది దస్తావేజు లేఖర్లు జీవనోపాధిని కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పరోక్షంగా నాలుగు లక్షల మంది వరకూ రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దస్తావేజులు ఫిజికల్ డాక్యుమెంట్ల రూపంలో ఉంటేనే ప్రజల ఆస్తులకు భద్రత ఉంటుందని చెప్పారు. గతంలో ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ఎన్నికల ప్రచారంలో అస్త్రంగా వాడుకున్న కూటమి నాయకులు, అధికారంలోకి వచ్చిన తరువాత యథావిధిగా కొనసాగించేందుకు ప్రయత్నించడం తగదన్నారు. సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవలసిన ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు తెలిపారు. పాత పాలకవర్గాన్నే కొనసాగిస్తున్నట్టు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో జిల్లా దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు శేషు,కార్యదర్శి గున్నాజీరావు,సంయుక్త కార్యదర్శి మురళీకృష్ణ, కోశాధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు.


బిల్లును వ్యతిరేకిస్తున్న జిల్లా దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పాలకవర్గ సభ్యులు

సిరులతల్లికి తులసిపూజ



దువ్వాడ,రైల్వే: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.